

# హైదరాబాద్ వార్త


## వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు

### సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, మార్చి 6,ప్రభాతవార్త: వచ్చే వేసవికాలం..వర్షం కాలంను దృష్టి పెట్టుకుని హైదరాబాద్‌నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈమేరకు బుధవారం సెక్రటేరియట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిహెచ్ఎంసితోపాటు హైదరాబాద్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పొన్నం మాట్లాడుతూ వేసవి కాలంలో నగర ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులకు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి బ్యారేజీలల్లో ఉన్న నీటిలెవల్స్‌పై ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలని సూచించారు. 2017 తర్వాత ఈసంవత్సరంలోనే కొంత వర్షభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ నగరానికి తాగు నీటి ఇబ్బందులు లేవని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వేసవికాలంతో పాటు రానున్న రంజాన్ నెలను దృష్టిలో పెట్టుకుని వాటర్ టాంకర్లు 24గంటలు తిరగడానికి అధికారులు అనముతి ఇవ్వాలని సూచించారు.

## ఔటర్ అవతలికి వాయు నీటి కాలుష్య పరిశ్రమల తరలింపులో.. సవాళ్లు



**ఔటర్ అవతలికి పరిశ్రమల తరలింపు ప్రక్రియ కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. దశాబ్దం క్రితం రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను తరలించాలని సంకల్పించినా నిర్వాహకులు అంగీకరించడం లేదు. తరలింపు వల్ల 50 శాతం వరకు నష్టాలు వస్తాయని, వాటిని భరించేదెలా అని ప్రశ్నిస్తున్నారు. నగరంలోలాగే అనువైన వాతా వరణం, మౌలిక సదుపాయాలపై హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పదేళ్ల క్రితం 1700లకు పైగా రెండ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమల తరలింపునకు కార్యా చరణ సిద్ధం చేశారు. 2016 వరకు 1545 ఫార్మా, రసాయన ఉత్పత్తుల పరిశ్రమలను గుర్తించిన అధికా రులు వాటిలో 385 పరిశ్రమలను మాత్రమే తరలిం చారు. ఐదేళ్లలో అనుమ తులు లేకుండా అనేక కాలుష్య కారక పరిశ్రమలు కాటే దాన్, నాచారం, జీడిమెట్ల ప్రాంతాల్లో నెలకొల్పారు.**

హైదరాబాద్, మార్చి 6 ప్రభాతవార్త : గ్రేటర్ పరిధిలో 7వేల ఎకరాల్లో పరిశ్రమ లున్నాయి. జనావాసాల మధ్య ఉన్న వాటిని తరలించాల్సి వస్తే 10వేల ఎకరాలు అవస రమని అప్పట్లో నిర్ణయించారు. కాలుష్యాన్ని వెదజల్లే వంట నూనెల పరిశ్రమల కోసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో 200 ఎకరాలు, ఐరన్, స్టీల్ పరిశ్రమల కోసం వికారాబాద్ జిల్లా రాకంచర్లలో టిఎస్ఐఐసీ భూములు కేటాయించింది. కానీ ఫ్యాక్టరీల నిర్వాహకులు మౌలిక వసతులు లేవని ఆసక్తి చూప లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా బల్క్‌డ్రగ్ యూని ట్లు ఉండగా, వాటిలో సగానికంటే ఎక్కువ ఓఆర్ఆర్ లోపలే ఉన్నాయి. పర్యా వరణ అనుమతులు తీసుకొని ముచ్చెర్ల వద్ద ఫార్మాసిటీకి వీటిని తరలించాలని భావించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఔషద నగరిని రద్దు చేయడంతో తరలింపు ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించకుండా బహిరంగ ప్రదేశా ల్లో వ్యర్థాలను పారబోస్తున్న కాలుష్య కారక పరిశ్రమ లపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి)కి లెక్కలే నన్ని ఫిర్యాదులు అందాయి. ఇప్పటి వరకు 83 పరిశ్ర మలపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసు కుంది. మరో 132 పరిశ్రమలపై వచ్చిన ఫిర్యా దులపై టాస్క్‌ఫోర్స్ బృందం విచారించి కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్, కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనల ప్రకారం నియంత్రణ చర్యలు చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేస్తూ గడువు విధించింది. పిసిబికి వచ్చే ఫిర్యా దులో రెడ్ కేటగిరి పరిశ్రమలపై అధికంగా ఉంటు న్నాయి. ఫార్మా, షుగర్, డిస్టిలరీ, థర్మల్ పవర్ ప్లాం టు వంటి పరిశ్రమలు ఇందులో ఉన్నాయి. కొన్ని పరిశ్ర మలు రసాయన వ్యర్థాల్ని శుద్ధి చేయకుండా భూగర్భ పైప్‌లైన్ల ద్వారా సమీపంలోని చెరువులు, కుంటలు వంటి నీటి వనరుల్లో కలిపేస్తున్నాయి. మరి కొన్ని పరి శ్రమల యజమానులు వర్షపు నీటిలో కలిసి పోయేలా, వానాకాలంలో రసాయన వ్యర్థాల్ని వది లేస్తున్నారు. సమీపంలో చెరువులు లేకుంటే ట్యాంకర్ల ద్వారా అర్ధరాత్రి వేళ తరలించి నీటి వనరులున్నచోట కలిపేస్తు న్నారు. సంగారెడ్డి జిల్లాలోని రెడ్ కేటగిరి పరి శ్రమలపై ఎక్కువగా ఫిర్యాదులొస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి నష్టం కలిగిస్తున్న పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలిం చాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

## జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో 14 అంశాలకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావవేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మీ, కమిషనర్ రోనాల్డ్ రోస్

హైదరాబాద్, మార్చి 6,ప్రభాతవార్త: జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ 14 అంశాలకు అమోదం తెలిపింది. ఈమేరకు బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశానికి కమిషనర్ రోనాల్డ్‌రోస్‌తోపాటు కమిటీ సభ్యులుగా ఉన్న కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. స్టాండింగ్ కమిటీ పాలసీ నిర్ణయాల కమటిటీ అని నిర్మాణాత్మక ,ప్రజోపయోగమైన నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని కార్పొరేటర్లు ,అధికారులకు సూచించారు.

**స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు ...**

• స్టాండింగ్ కమిటీ తదుపరి సమావేశం పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రతిగురువాం నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించడం జరిగింది • జిహెచ్ఎంసిలో ప్రాపర్టీ, యుటిలిటిల గుర్తింపుకు జిఐఎస్ బేస్డ్ సర్వే మ్యాపింగ్ అమలుకు అమోదం తెలిపింది • కూకట్‌పల్లి మండలం ఎల్లమ్మ చెర్వునుంచి డ్రైనేజీ గతంలో ప్రతిపాదించిన 1200 ఎంఎం డయాపైప్‌లైన్‌కు మొత్తం 274 లక్షలు మంజూరు కాగా అవే నిధులతో 1600ఎంఎం పైప్‌లైన్ వేసేందుకు ఆమోదం తెలిపింది • అలాగే శేరిలింగంపల్లి మండలం నానక్‌రామ్‌గూడ రంగలాల్ కుంట వద్ద బ్యాలెన్స్ అభివృద్ధి పనులు చేసేందుకు మెస్సర్స్ యుటైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (ఎంయుఏహెచ్)ఏజెన్సీకి సిఎస్ఆర్ కింద ఒక సంవత్సరం పాటు రెన్యూవల్‌కు ఎంవోయు చేయుటకు కమిషనర్‌కు అనుమతిస్తూ అమోదం తెలిపింది • అలాగే శేరిలింగంపల్లి మండలం హాఫీజ్‌పేట్ కొత్తకుంట చెరువు వద్ద మిగులు అభివృద్ధి పనులను చేసేందుకు ఎంయుఏహెచ్‌కు ఒక సంవత్సరం పాటు పొడిగిస్తూ జిహెచ్ ఎంసి కమిటసనర్‌కు ఎంవోయు చేసేందుకు అనుమతించింది • కూకట్‌పల్లి మండలం మూసాపేట్ ముళ్లకత్వ చెరువు వద్ద అభివృద్ధి పనులను చేసేందుకు ఎంయుఏహెచ్ ఏజెన్సీకి సిఎస్ ఆర్‌కింద ఒక సంవత్సఉరం పాటు పొడిగిస్తూ ఎంఒవయు చేసేం దుకు అనుమతిస్తూ కమిటీ ఆమోదం తెలిపింది • శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి బర్లకుంట చెరువు పునరుద్ధరణ, నిర్వాహాణకు సిఎస్ఆర్ కింద 24 నెలల కాలవ్యవధిలో పనులు చేసేందుకు మెస్సర్స్ ధృవాన్ష్ ఆర్గనైజేషన్‌తో ఎంవోయూ చేసేందుకు కమిటీ అమోదం తెలింది •శేరిలింగంపల్లి మండలం కొత్తగూడ నేరేళ్ల చెరువు పునరుద్దరణకు సిఎస్ఆర్ కింద మెస్సర్స్ నిర్మాణ్ ఆర్గనైజేషన్‌కు 24నెలల కాల వ్యవధికి మిగతా సిటీ 2వ పేజీలో

## మర్రి చెన్నారెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉంది

### బీజేపీ నాయకులు మర్రి శశిధరరెడ్డి




మర్రి చెన్నారెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్రి శశిధరరెడ్డి

బేగంపేట మార్చి 6,ప్రభాతవార్త : బేగంపేట ప్రకాష్ నగర్ బస్టాప్ వద్ద గడచిన 27సంవత్సరాలుగా పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాన్ని తాను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ నాయకులు మర్రి శశిధరరెడ్డి అన్నారు. తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి,మాజీ గవర్నర్ మర్రి చెన్నారెడ్డి పేరుతో షేక్ గౌస్ గడచిన 27సంవత్సరాలుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తూ వేసవి కాలం అంతా ప్రజల దాహార్తిని తీరుస్తున్నారని ఆయన అన్నారు.బస్టాప్ వద్ద ఉన్న ఈ చలివేంద్రం ప్రయాణీకులకు,పాదచారులకు తాగునీరందిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పురురవారెడ్డి, షేక్ గౌస్, నెమలి ఆనంద్, వజనాల దయానందరావు, తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుంది: మర్రి**

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ నాయకులు మర్రి శశిధరరెడ్డి అన్నారు.బుధవారం బేగంపేట ఓల్డ్‌పాటిగడ్డలో శక్తి వందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మర్రి శశిధరరెడ్డి మాట్లాడుతూ పేద మహిళలను ఆర్థికంగా పరిపుష్టిగా చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుం దర్‌గౌడ్, అమీర్‌పేట కార్పొరేటర్ కె.సరళ,రాజశేఖరరెడ్డి,శ్రీశైలం గౌడ్, పెద్ది రవీందర్,నెమలి ఆనంద్(నందూ),డివిజన్ ప్రసిడెంట్ మహేష్ కుమార్, విజయ్‌కుమార్ మహిళా మోర్చా సంధ్యా లక్ష్మి,జయ మ్మ,పద్మ, రేణుక, డివిజన్ ప్రశిడెంట్ మహేష్‌కుమార్,విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు: ఎమ్మెల్యే మాగంటి




బోరబండ సైట్3లో జీహెచ్ఎంసీ తొలగించిన బడ్డీకొట్లను పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్

యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త : పేదలు నివసించే జూబ్లీ హిల్స్ నియోజకవర్గం పరిధిలోని సైట్3లో జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలంటూ తొగించిన బడ్డీకొట్లను స్థానిక శాసన సభ్యులు బుధవారం పరిశీలించారు. కావాలనే కొందరు పేదలపై ఫిర్యాదులు చేయడం అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ వారి వ్యాపారాలను దెబ్బతీసే విధంగా బడ్డీకొట్లను తొలగించడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్సీ ప్రభాకర్‌తో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పేదలకు అన్యాయం చేయాలని చూస్తే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకునేది లేదని పేర్కొన్నారు.

## సీతారాం విల్లాస్‌లో చోరీ

కొంపల్లి, మార్చి 6, ప్రభాతవార్త : బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాం విల్లాస్‌లో దుండగులు రెండు విల్లాస్‌లలో తాళాలు పగలగొట్టి చోరికి పాల్పడ్డారు. క్రైమ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లిలోని సీతారామ హోమ్స్‌లో తాళం వేసిన రెండు విల్లాలో చిన్న మొత్తం నగదు, కొన్ని ఆభరణాలు అపహరణకు గురైన ట్లు డి.శ్రీనివాసరావు, కబీరు విశ్వనాథం ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు

### చూసీ చూడనట్లు పోలీసులు, మున్సిపల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

అఫ్జల్‌గంజ్ చౌరస్తా నుంచి పత్తర్‌మజీద్ వరకు మధ్యాహ్నం సమయంలో కూడా విపరీమైన ట్రాఫిక్ కలుగుతుంది. సుల్తాన్ బజార్ ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా అఫ్జల్‌గంజ్ నేషనల్ హోటల్ చౌరస్తా నుంచి మొదలుకుని శంకర్‌షేర్ హోటల్ చౌరస్తా, గౌలిగూడ చమన్ వరకు ఇరువైపుల్లా తమ వస్తువులను ఫుట్‌పాత్‌లపై నిల్చు ఉండటం మూలంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ సుల్తాన్‌బజార్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



గౌలిగూడ శంకర్‌షేర్ వద్ద ఫుట్‌పాత్ కబ్జాలు చేసుకుని వ్యాపారులు

బేగంబజార్, మార్చి 6 ప్రభాతవార్త: అఫ్జల్‌గంజ్ చౌరస్తా నుంచి గౌలిగూడ శంకర్‌షేర్ హోటల్ మీదుగా పుత్లీబౌలి వేళ్లే రహదారి పూర్తిగా వ్యాపారుల వస్తువులను ఫుట్‌పాత్‌లపై పెట్టడంతో పూర్తిగా కుదించుకుపోతుంది. ఇది చూసిచూడనట్లు అటు ట్రాఫిక్ పోలీసులు, ఇటు జిహెచ్ఎంసి ఎన్‌పోర్స్‌మెంట్ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. దీనికితోడు తమ సామాన్లు పూర్తిగా ఫూట్‌పాత్‌లపై పెట్టి అక్రమాలకు పాల్పడుతు న్నారు. అఫ్జల్‌గంజ్ నేషనల్ హోటల్ మీదుగా వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా రహదారులు ఇరువైపుల్లా పార్కింగ్ చేయడడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రతిరోజు త్రిచక్ర వాహనాలు, ఫోర్‌వీలర్ వాహనాలను రహదారుల ఇరువైపుల్లా నిలుపుతున్నారు. దీనికితోడు ఈరహదారిపై మధ్యంషాపు ఉండటంమూలంగా ఉదయం10గంటల నుంచి అమ్మకాలు సాగిస్తుంటారు.మద్యం కొనుగోలు వచ్చే మద్యం ప్రియులు తమ వాహనాలను కూడా పార్కింగ్ చేయడం ద్వారా రోడ్డు కుదించుకపోతుంది. ఈ రహదారిపై ఆయిల్‌షాపులు ఉండటం మూలంగా ఆయిల్ డ్రమ్ములను కూడా ఫుట్‌పాత్‌లపై ఉంచడంతో ట్రాఫిక్ జాం కలుగుతుంది.దీనికి తోడు ప్రైవేట్ కార్లు పార్కిగ్ చేయడం ద్వారా పూర్తిగా రోడ్డు కుదించుకు పోతుంది. వాహనాలలో తీసుకు వచ్చే నిత్యాసరుకుల తో పాటు ఇతరత్రా వస్తువులనులోడింగ్,అన్‌లోడింగ్ చిన్నఆటో రిక్షాలలో చేస్తుంటారు. దీనికి తోడు ఆటోరిక్షా డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటారు. నిబంధనలను ఉల్లంఘించి పూర్తిగా ఫుట్‌పాత్‌లను కబ్జా చేసుకుని వ్యాపారులు కొనసాగిస్తున్నారు.

## సమస్యల పరిష్కారంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్



మోండా మార్కెట్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్, కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్,మార్చి 6 ప్రభాతవార్త: గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. బుధవారం ఉదయం మోండా డివిజన్‌లోని టకార బస్తీ, సికింద్రాబాద్ స్టేషన్ 31 బస్టాప్, రెజిమెంటల్ బజార్ పరిసర ప్రాంతాల్లో డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యలతో పాటు ఇంజనీరింగ్, శానిటేషన్ వంటి వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటిం చారు. ఆయా ప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని ఎప్పటి కప్పుడు తొలగించాలని, పాడైన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని నాలాలను ఎప్పటి కప్పుడు క్లీన్ చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు రవిందర్, ప్రశాంత్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను అందించాలి



పరిపాలన భవనం ముందు ఆందోళన చేస్తున్న ఒయూ అధ్యాపకులు

తార్నాక, మార్చి 6 ప్రభాతవార్త: ఓ.యూ అధ్యాపకులకు సీపీఎస్ విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని పలువురు అధ్యాపకులు బుధవారం ఆర్ట్స్ కాలేజ్ నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించి భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఓ.యూలో వెంటనే సీపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ స్కీమ్‌ను సాధించే వరకు పలు రూపాల్లో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అన్ని యూనివర్సిటీలు, ప్రభుత్వ సంస్థల్లో సీపీఎస్ అమలవుతోందని, ఓ.యూలో మాత్రం ఎల్ఐసీ లింక్‌డ్ పెన్షన్ విధానం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ సమస్యపై ప్రభుత్వానికి పలు మార్లు వినతులు ఇచ్చానా ఫలితం దక్కలేదన్నారు. దీంతో ప్రతి నెల తాము పెద్ద మొత్తంలో పెన్షన్‌ను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ ఎల్ఆర్ఎస్ రగడ

### ఉచితంగా అమలు చేయాలి ● నగర వ్యాప్తంగా బిఆర్ఎస్ ధర్నాలు, నిరసనలు

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం వైఖరికి నిరసనగా హెచ్ఎండిఏ కార్యాలయం వద్ద మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మీ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం వద్ద ఆపార్టీ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ధర్నా చేపట్టారు. ఎన్నికల ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కూకట్‌పల్లి జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం వద్ద జోనల్ కమిషనర్‌కు కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు బిఆర్ఎస్ కార్పొరేటర్లు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. అయితే వారిని కార్యాలయంలోకి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతపలువురు మహిళలు కిందపడి గాయాలపాలయ్యారు.



అమీర్‌పేట్‌లోని మైత్రివనం వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, సాయికిరణ్ యాదవ్ తదితరులు

హైదరాబాద్, సంజీవరెడ్డి నగర్, మార్చి 6 ప్రభాతవార్త : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామి మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. బిఆర్ ఎస్ పార్టీ పిలుపు మేరకు బుధ వారం అమీర్‌పేట్‌లోని మైత్రివనం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద కుటుంబాలకు ఇబ్బందులు పెట్టొద్దనే ఉద్దేశ్యంతో బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఎల్ఆర్ఎస్ జోలికి వెళ్ళ లేదని పేర్కొన్నారు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ఆచరణ సాధ్యంకాని అనేక హామీలు ఇచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీని మరిచి ఎల్ఆర్ఎస్ పేరుతో 25లక్షల కుటుంబాలపై ఆర్థికభారం మోపి 20వేల కోట్ల రూపాయల వరకు దోపిడి చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ధ్వజమెత్తారు. నాడు ఎల్ఆర్ఎస్‌పై మాట్లాడిన నేటి మంత్రులు ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని, అప్పటి వరకు ప్రభుత్వంపై ఆందోళన కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం హెచ్ఎండిఏ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు నామ శేషుకుమారి, ఆకుల రూప, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలి

### ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లులక్ష్మి



ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

చిక్కడపల్లి, మార్చి 6 ప్రభాతవార్త మహిళలకు రాజకీయ రంగంలో ఆర్థిక సామాజిక రంగాలలో సమానత్వం కల్పించాలని అఖిల భాతర ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి, పద్మశ్రీ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మల్లులక్ష్మి, రాష్ట్ర స్థానిక మహిళా కన్వీనర్ రమ మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం శ్రీవిముక్తి కోసం జరిగే పోరాటాలకు స్ఫూర్తినిచ్చే రోజు 8 గంటల పనిదినం కావాలని, పని ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనం కావాలని ఓటు హక్కు కావాలని పోరాడాలని రక్తతర్పణం చేసి హక్కులు సాధించుకున్న శ్రామిక మహిళలు వారి త్యాగాలు వెలకట్టలేనిదన్నారు. మహిళలు అన్ని రంగాలలో విద్య, వైద్యంలో క్రీడాలలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుకు పోతున్న మహిళల పట్ల వివక్షత అసమానత లైంగిక వేదింపులు పెరుగుతున్నాయని అన్నారు. లింగ సమానత్వ సూచిలో 146 దేశాలకుగాను 127 స్థానంలో మన దేశం ఉందని, ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధి ప్రక్రియ భాగస్వామ్యం కావాలని, వాటిని అమలు అయ్యేవరకు మహిళలం దరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు అరిబండి ప్రసాద్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు వందన, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ మమత, డివైఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్‌కన్వీనర్ శృతి, ఐద్వా ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, శశికళ, వినోద, రాష్ట్ర కమిటీ నాయకులు సృజన, పద్మ, షభానా తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణకు చట్టబద్ధత కోసం ఎఐసిసి, సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలి

సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త: మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కోసం ఎఐసిసి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజుమాదిగ, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాంమాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సిఎం ఇచ్చిన హామీ ప్రకారం దళితులకు 12 లక్షల రూపాయలు డా.బి.ఆర్.అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రెండు సీట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో కందుల సాయినాథ్, కోట్టె పద్మయ్య, సిలివేరు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులందరిని ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలి

సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త: రాష్ట్ర హైకోర్టులో గత సంవత్సర కాలంగా ప్రభుత్వ న్యాయవాదులుగా, సహాయ న్యాయవాదులుగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులందరిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి డిమాండ్ చేసింది. లేని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజుమాదిగ హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హైకోర్టులో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ న్యాయవాదులుగా పనిచేసుకోవడానికి అవకాశం కల్పించలేదని, గత 9 సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. మాదిగలను అడిషినల్ పిపిగా, అసిస్టెంట్ పిపిగా, జిపిగా, ఎజిపిగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహంకాళీ కొత్త ఎసిపికి స్వాగతం, పాత ఎపిసీకి వీడ్కోలు



,బదిలీ అయిన మహంకాళీ ఎసిపి రవీందర్‌ను సత్కరిస్తున్న నూతన ఎసిపి సర్ధార్‌సింగ్ పోలీసులు

బేగంపేట మార్చి 6,ప్రభాతవార్త : మహంకాళీ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించి తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీకి బదిలీపై వెళుతున్న ఏసీపీ రవీందర్ కు పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.సీఐడీ నుంచి మహంకాళీ డివిజన్‌కు నూతన ఏసీపీ గా వచ్చిన సర్ధార్ సింగ్‌కు పోలీసులు స్వాగతం పలికారు. బుధవారం సీఐడీ నుంచి మహంకాళీ డివిజన్ ఏసీపీ గా వచ్చిన సర్ధార్ సింగ్‌కు గతంలో ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రవీందర్ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా పలువురు పోలీసులు అధికారులు,సిబ్బంది బదిలీపై వెళుతున్న ఏసీపీ రవీందర్‌కు పూలు చల్లుతూ బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు పలికారు.కొందరైతే ఆయన బదిలీపై వెళుతుండటంతో కంటతడి పెట్టారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ఇన్స్‌పెక్టర్ పరుశురాంతో పాటు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తాం

**సమాచార, రెవెన్యూ, హౌసింగ్‌శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



హెచ్‌యూజే డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త: అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలో ఇండ్ల స్థలాలు ఇస్తామని సమాచార, రెవెన్యూ, హౌసింగ్‌శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన కార్యాలయంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే నాయకులు జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల ప్రధాన సమస్య అయిన ఇండ్ల స్థలాల అంశం త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సీనియారిటీని బట్టి కేటగిరీలుగా విభజించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలం అందేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ పాల్గొన్నార

## లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలి

సికింద్రాబాద్, మార్చి 6 ప్రభాతవార్తః లష్కర్ జిల్లా ఏర్పాటును కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుదవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లష్కర్ జిల్లా ఏర్పాటు కొరకు తనవంతుగా పూర్తి సహాయ సహకరాలు ఉంటాయని, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వడ్డెర కార్మికులకు అండదండగా వడ్డెర సంక్షేమ సంఘం

**రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య**



మృతిచెందిన వడ్డెర సంఘకార్మికుడు బొంత లింగయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, పిల్ల మల్లేష్, సంఘ నాయకులు

కుత్బుల్లాపూర్, మార్చి 6 ప్రభాతవార్త: తెలంగాణలోని ఏ ఒక్క వడ్డెర కార్మికుడి కుటుంబానికి ఇబ్బందులు ఎదురైనా వడ్డెర సంక్షేమ సంఘం పూర్తి సహాయ, సహకారాలను అందిస్తుందని తెలంగాణ వడ్డెర సంక్షేమరాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య హామీఇచ్చారు. కార్వాన్‌కు చెందిన బొంత లింగయ్య గత 28న మరణించగా వారి కుటుంబానికి బాసటగా రూ.లు.10,000ఆర్థిక సహాయం సంఘ రాష్ట్ర నాయకులు పిట్ల మల్లేష్, యువజన నాయకులు కొమ్మరాజుల శేఖర్, శివరాత్రి వెంకటేష్, దండుగుల మహేశ్, ఇరగదింట్ల రమేశ్, కార్వాన్ వడ్డెర సంఘ నాయకులు పి.చంద్రమౌళి, వి.వెంకటేశ్, రాజు, బి.శ్రీనుల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా ఎత్తరి మారయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించి విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేకప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

## బస్తీ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తా

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



బస్తీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త: ముషీరాబాద్ డివిజన్‌లోని బృందావన్ బస్తీ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం అధికారులతో కలసి బస్తీ సమస్యలపై ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులతో సమస్యలపై చర్చించారు. అనంతరం బృందావన్ బస్తీ అధ్యక్షునిగా ఎన్నికౌన నాగులు యాదవ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు శివముదిరాజ్, గోరఖ్‌నాథ్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్, డిఈ గీత, వాటర్ వర్క్స్ మేనేజర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

## చట్టసభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలి

**ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి**



మహిళలను సత్కరిస్తున్న సిరికొండ మధుసూదనాచారి, కళావిఎస్.జనార్ధనమూర్తి

చిక్కడపల్లి, మార్చి 6 ప్రభాతవార్త: చట్టసభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భిన్న రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు కొమ్మజోసుల లలిత, సూరంపూడి శ్రీమణి, తాళ్ళపల్లి శోభారాణిలను సత్కరించి అభినందించారు. మహిళలు అన్ని రంగాలలో తమప్రతిభ కనపరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యురాలు భమిడి ఉషా తదితరులు పాల్గొన్నారు.

## 8న వీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప సాయిబాబ దేవస్థానంలో ప్రత్యేక పూజలు

యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేది శుక్రవారం వెంగళ్‌రావునగర్ జీటీఎస్ కాలనీ శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప సాయిబాబ దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.శుక్రవారం ఉదయమే అభిషేకము, ఉదయం 9 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 8 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం రాత్రి 10 గంటలకు అభిషేకం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ చైర్మన్ చిన్నరమేష్, కార్యనిర్వాహణ అధికారి జయరామయ్య తెలిపారు.

**స్వరాజ్‌నగర్‌లో..** బోరబండ స్వరాజ్‌నగర్‌లో శ్రీ హరిహర క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలవల సత్యనారాయణరావు తెలిపారు. శుక్రవారం ఉదయమే అభిషేకము, రాత్రి 10.30 గంటలకు శివపార్వతుల కళ్యాణం, రాత్రి 12 గంటలకు మన్యాస పూర్వక రుద్రాభిషేకం జరపడుతుందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్, మజ్లిస్‌ల మధ్య ఎటువంటి ఒప్పందం లేదు

**పులిపాటి రాహుల్**

చార్మినార్, మార్చి 6 ప్రభాతవార్త : కాంగ్రెస్,మజ్లిస్ పార్టీలపై సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాహుల్ ఖండించారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నెల 5వ తేదీ సాయంత్రం పాతబస్తీ అరుంధతీనగర్‌లో అంగన్‌వాడి కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తాను నిర్మిస్తున్న ఓవైసీ స్కూల్‌కు తీసుకెళ్లి అక్కడ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లటం జరిగిందని తెలిపారు.ఈవిషయంలో సోషల్ మీడియోలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీనిని ఖండిస్తున్నామని ఆయన తెలియజేశారు.ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎటువంటి ఒప్పందం లేదని,సోషల్ మీడియోలో తప్పుడు ప్రచారం చేస్తే చట్ట పరమైన కేసులు పెడతామని రాహుల్ తెలిపారు.

## అవినీతి నిర్మూలన ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

అఫ్జల్‌గంజ్, మార్చి 6 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాలల్లో సామాన్య పౌరులకు సమస్యలను పరిష్కరించేందుకుగాను డబ్బులు అడుగుతున్నారని తెలంగాణ అవినీతి నిర్మూలన ఫౌండేషన్ అధ్యక్షులుగా నియమితులైన ఎన్.ఆర్‌లక్ష్మన్‌రావుగుప్త ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూస్తానన్నారు.ది అవినీతి నిర్మూలన జాతీయ ఫౌండేషన్ నియమించినట్లు చెప్పారు.

## జీవ శాస్త్ర పరిశోధనలతో ఎంతో ఉపయోగం ఉంది

**ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్**



మైక్రోబయాలజీ జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీరును ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్, ప్రొఫెసర్లు భీమా, చాంద్‌పాషా

సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త: జీవ శాస్త్ర రంగాల్లో పరిశోధనలు చేస్తూ నూతన ఆవిష్కరణలు చేయడం వల్ల విద్యా, ఉపాధి రంగాల్లోనే అవకాశాలు కాకుండా సమాజ వికాసానికి ఎంతో ఉపయోగం లభిస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ చెప్పారు. మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిజాం కళాశాలలో 'ఇన్నోవేషన్స్ ఇన్ మైక్రోబియల్ బయోటెక్నాలజీ:పయనీరింగ్ ది ఫ్యూచర్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.భీమా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ప్రపంచ పోటిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులే కాకుండా అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు నూతనంగా ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు-అధ్యాపకుల పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. ఈ సదస్సులో కన్వీనర్ ప్రొఫెసర్ చాంద్‌పాషా, ప్రొఫెసర్ బుర్రి రంగారెడ్డి, ఎల్.వెంకటేశ్వర్‌రావు, ప్రొఫెసర్ గీతా శర్మ, డా.అంజురాజు, డా.దరావత్ సాంబశివరావు పాల్గొన్నారు.

## వివాదానికి దారితీసిన ఆందోళన

**ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు డిసి కనీస మర్యాద ఇవ్వరా..?**



ధర్నాలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్, మార్చి 6 ప్రభాతవార్త: ఎల్ఆర్ఎస్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా చేయాలనే డిమాండ్‌తో బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆందోళన అల్వాల్‌లో ఎమ్మెల్యే వర్సస్ డిసిగా మారింది. బుధవారం ఉదయం సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన కోసం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటుగా ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనీల్ కిషోర్‌లుతో పాటుగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ధర్నా జరుగుతున్న సమయంలోనే డిసి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయం ప్రధాన గేటు వద్దకు కారులో రావడం జరిగింది. కారు లోపలికి వెళ్ళే అవకాశం లేక పోవడంతో పక్కకు జరగాలని బిఆర్ఎస్ నేతలను ఆయన కోరారు. కారు దిగి వినతి పత్రం స్వీకరించాలని కార్యకర్తలు కోరినా డిసి పట్టించుకోలేదు. నలభై నిమిషాలు పాటు ఆయన అలాగే కారులోనే కూర్చుని ఉన్నారు. ఎమ్మెల్యేతో పాటుగా కార్పొరేటర్లు ఉన్నా కనీస మర్యాద డిసి ఇవ్వలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదం ముదిరి పాకాన పడుతున్న నేపథ్యంలో అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కల్పించుకుని ఇరు వర్గాలను సముదాయించారు.

**ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాల్సిందే: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఎన్నికలులో ఉచితంగా ఎల్ఆర్ఎస్‌లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని మరువరాదన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆరు గ్యారెంటీలులో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని తెలిపారు.


## కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి కార్యదర్శి అల్లం భాస్కర్, యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి రవి రాజ్

చార్మినార్,మార్చి 6 ప్రభాతవార్త : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని టిపిసిసి కార్యదర్శి అల్లం భాస్కర్,యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజ్‌లు అన్నారు.యాకుత్‌పుర నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలకు వారు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శులు మామిడి కృష్ణ కుమార్,కోట్ల శ్రీనివాస్,గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు రాజు యాదవ్,కాంగ్రెస్ నాయకులు కోట్ల లడ్డు,శశి యాదవ్,నళిని గౌడ్, మల్లిఖార్జున్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



చార్మినార్, మార్చి 6 ప్రభాతవార్త : పాతబస్తీ ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం జరిగింది.ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ ఎస్ఐ హసీనా,డాక్టర్లు రుబీనా,అమీనా,మీర్జా హైమద్ అలీ బేగ్‌లు పాల్గొని మహిళా ఉద్యోగులను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హసీనా మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలోను పాల్గొంటున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఫలక్‌నుమా ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, ఎటిఎం,ఎఈఎం, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సకల కళల సమ్మిళితం సమ్మేళనం హరికథ

**సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు**



కళాకృష్ణ, ఉమామహేశ్వరి దంపతులకు అక్కినేని లలితకళా పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు

రవీంద్రభారతి, మార్చి 6 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ డాక్టరేట్ గ్రహీత, కేంద్ర ప్రభుత్వం చే పద్మశ్రీ పురస్కారం పొందిన దంపతులు నాట్యాచార్యుడు కళాకృష్ణ, హరికథా భాగవతారిణి ఉమామహేశ్వరిలాంటి మహోన్నత కళాకారులు మన తెలుగువారు కావడం తెలుగుజాతి అదృష్టమని, అక్కినేని శతజయంతి వేడుకల్లో భాగంగా వీరికి అక్కినేని లలితకళా పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సబబుగా ఉందని సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఏపి పాఠశాల విద్యానియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ ఆశీస్సులతో, యువకళావాహిని ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో భాగంగా రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన అక్కినేని లలితకళా పురస్కార ప్రదానోత్సవానికి హాజరయ్యారు.

## సుబ్రమణ్య స్వామి దేవాలయంలో మహా శివరాత్రి

**ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్**



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు సంతోష్ యాదవ్,చొల్లేటి రమేశ్ తదితరులు

కంటోన్మెంట్,మార్చి 6 ప్రభాతవార్త: కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీసుబ్రమణ్య స్వామి దేవాలయంలో ఈ నెల 7,8 తేదీల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్, ఆలయ ఈఓ అరుణ కుమారి, ట్రస్ట్ బోర్డు మెంబర్ చొల్లేటి రమేశ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం రుద్రహోమం, శివకళ్యాణం, ఈ నెల 8న మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం, సంతత దారాబిషేకం, అర్చనలు, అష్టోత్తర 105 కళశాలతో అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు వేణుగోపాల్, భాస్కర్, గుజ నాగేందర్ యాదవ్, నర్సింగ్‌రావ్, పద్మజా, ప్రధాన అర్చకులు టీ.రాజేశ్వర శర్మ తదితరుల పాల్గొన్నారు. ఈ మహా శివరాత్రి వేడుకలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వెన్నెల గద్దర్‌లు ముఖ్య అతిధిగా విచ్చేయనున్నట్లు వారు తెలిపారు.

## సుల్తాన్‌బజార్ పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.శ్రీనివాస్‌చారి

బేగంబజార్, మార్చి 6 ప్రభాతవార్త: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.శ్రీనివాస్‌చారి నియమితులయ్యారు. ఇటీవల కమీషనరేట్ పరిధిలో జరిగిన ఇన్‌స్పెక్టర్ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కొత్తపల్లి ముత్తు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసాచారి భాద్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న శాంతి భద్రతల పరి రక్షణకు తనవంతు కృషి చేస్తామన్నారు.

## కులాలకు సమ ప్రాధ్యానత కల్పించాలి



మహంకాళీ అమ్మవారి చిత్రపటాన్ని అందచేస్తున్న ప్రజా ఏక్తాపార్టీ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త,నరేష్

బేగంబజార్, మార్చి 6 ప్రభాతవార్త: అన్ని మతాలను,కులాలకు సమ ప్రాధ్యానత కల్పించవల్సిన భాద్యత పాలకులపై ఎంతైనా ఉందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త అన్నారు. గౌలిగూడ అమ్మవారి దేవాలయంలో ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్త చేతుల మీదుగా ప్రజాఏక్తాపార్టీ నాయకులు దూత్‌పాల నరేష్ అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి భక్తుడు నరేష్ డిజిటల్ లైట్లతో రూపొందించిన చిత్రపటాన్ని అందచేశారు. ఈకార్యక్రమంలో సురేష్‌గౌడ్,రాజు,అర్షద్ పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో 14 అంశాలకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి..**

ఎవోయూ చేసేందుకు కమిషనర్‌కు అనుమతిస్తూ ఆమోదం తెలిపింది • ముసారంబాగ్ మూసి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అలీకేఫ్, అంబర్‌పేట్ అలీకేఫ్ ,అంబర్‌పేట్ నఉంచి ముసారాంబాగ్ స్పైస్ రెస్టారెంట్ వరకు ,అలీకేఫ్ ఎక్స్ రోడ్‌నుంచి అంబర్‌పేట్ బ్రిడ్జి అజామాబాద్ డివిజన్‌కు యుటిలిటీల షిఫ్టింగ్ కోసం అంచనా వ్యయం మొత్తం రూ. 3,97,32,391 లకు పరిపాలన అనుమతికి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది • ఛీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ద్వారా 31 ఆగస్టు 2023 నుంచి 40నవంబర్ 2023వరకు జిహెచ్ఎంసికి సంబంధించిన ఆదాయ, వ్యయ నివేదికను కమిటీ ముందు ఉంచారు •ఎల్బీనగర్ సర్కిల్ బైరామల్ గూడ చెరువు నుంచి సరూర్‌నగర్ చెరువుకు వరకు వర్షను నీటికాలువ నిర్మాణానికి రివైజ్డ్ అంచనా మేరకు (రూ.588లక్షల) అదనంగా రూ.10.52లక్షల మొత్తం 598లక్షల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది • జిహెచ్ఎంసి పారిశుద్ధ్యం, అడ్వర్టైజ్‌మెంట్‌పై రెండు అడ్‌హక్ కమిటీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

## ముఖ్యమంత్రి పిఆర్ఓగా శ్రీనివాసరావు



కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, మార్చి 6, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంబంధాల అధికారి (పిఆర్ఓ)గా సీనియర్ జర్నలిస్ట్ కూకట్‌పల్లి గోపాల్‌నగర్‌లో నివసించే వి.శ్రీనివాస రావు నియమితుల య్యారు. ఈ శ్రీనివాసరావు గత 20 ఏళ్ళకుపైగా జర్న లిస్ట్‌గా పనిచేస్తున్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల, ఊట్లపల్లి గ్రామానికి చెందిన శ్రీని వాసరావు పలు టీవీ ఛానెళ్లలో రిపోర్ట్ ప్రజెంటర్‌గా పని చేశారు.

## పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే మనస్థాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



ఎం. క్రిష్ణవేణి

కొంపల్లి, మార్చి 6, ప్రభాతవార్త : బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి ప్రగతి నగర్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఎం.కృష్ణవేణి (19) ధరణి అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎం.మహలక్ష్మీ, బాపిరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి ప్రగతి నగర్‌లో నివాసముంటున్నారు. ఇళ్ళల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కూతురు కృష్ణవేణి రెండు సంవత్సరాల క్రితం తూర్పు గోదావరి జిల్లా గవర్నమెంట్ కాలేజ్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యింది. అప్పటి నుంచి పరీక్షలు రాసినా పాస్ అవుతానో లేదో అనే మనస్థాపానికి గురై మానసికంగా బాధపడేది. ఈ నెల 5వ తారీకు రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బిల్డింగ్‌పైకి వెళ్ళి దూకి ఆత్మహత్య చేసుకుంది. తల్లి దండ్రుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేష్ తెలిపారు.

# పాల బిల్లులను చెల్లించలేని ప్రభుత్వం మాకెందుకు

## పాల బకాయిలను చెల్లించాలని విజయ డెయిరీ ముందు రైతుల ఆందోళన



బకాయిలను చెల్లించాలని వినతిపత్రాన్ని అందజేస్తున్న పాడీ రైతులు

**తార్నాక, మార్చి 6 ప్రభాతవార్త:** ప్రజలకు పాలు అందించే రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పాల బిల్లులను చెల్లించలేని స్థితిలో ఉండటం సిగ్గుచేటని ఈ ప్రభుత్వం మాకెందుకంటూ పలువురు పాడి రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పాల రైతులకు ఇనెసెంటీవ్ లీటర్‌కు రూ.5 ఇస్తామని హామి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాటలు బుట్టదాఖలయ్యాయని వారు ఆరోపించారు. బుధవారం లాలాపేట్‌లోని తెలంగాణ విజయ డెయిరీ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సంఘం విజయ భవనం ముందు వివిద జిల్లాల నుంచి వచ్చిన పలువురు పాడి రైతులు మధ్నాహ్నాం నుంచి సాయంత్రం వరకు ఎర్రటి ఎండలో ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి, జీఎం మల్లెయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి, తెలంగాణ రైతు సంఘం సంయుక్త ఆద్వర్యంలో నిర్వహించిన ఈ దర్నాకు పలువురు రైతులు పాల్గొని ఎండీ చెట్టెం లక్ష్మి వచ్చేవరకు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, తెలంగాణ విజయ డెయిరి పరిరక్షణ సమితి కన్వీనర్ సాదం రమేష్, కో...కన్వీనర్ ఇమ్మడి శ్రీనివాస్,తెలంగాణ రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి కేమిడి ఉప్పలయ్య మాట్లాడుతూ ఎండి చిట్టెం లక్ష్మికి ఎన్ని సార్లు వినతులు చేసినా తమకు న్యాయం జరుగడంలేదని ఆరోపించారు. మూడు సంవత్సరాలుగా తమకు రావలసిన ఇన్‌సెంటీవ్ చెల్లించడం లేదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చినా తమకు బకాయిలు రావడంలేదని ఆరోపించారు. పాల బిల్లులు 51 రోజులుగా తమకు చెల్లించడంలేదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పాడి రైతులకు ప్రతి 15రోజుల కొకసారి పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు డెయిరీ ఫాంల యాజమాన్యంపైన ఫైన్లు వేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటీవ్‌లను వెంటనే చెల్లించాలని కోరారు. పశువులకు ఇన్సూరెన్ పథకాన్ని,రైతులకు భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సొసైటీలను వెంటనే రిజిష్టర్ చేయించాలని కోరారు. అనంతరం ఎండి చిట్టెం లక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

## ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలి : ఆజం అలీ



నిరసన కార్యక్రమానికి తరలి వెళుతున్న ఆజం అలీ భూమేష్, అజిత్‌రెడ్డి

**మలక్‌పేట, మార్చి 6 ప్రభాతవార్త:** ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని మలక్‌పేట నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి ఆజం అలీ, సీనియర్ టిఆర్ఎస్ నాయకుడు తీగల అజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కొరుదు భూమేష్‌లు డిమాండ్ చేసారు. ఎల్ఆర్ఎస్ విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంల చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆజంపుర లోని బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయంనుండి నాయకులు, కార్యర్తలతో కలిసి వారు తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడం జరిగిందని అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో 25 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం మోపి దాదాపు 20 వేల కోట్ల రూపాయల దోపిడికి యత్నం చేస్తుందని ఆరోపించారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేసేవరకు ప్రభుత్వంపై ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లాయక్‌అలీ, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు చల్లూరి రఘునందన్ రెడ్డి, నాయకులు గౌర శశిధర్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి : కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మార్చి 6 ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే తాము ఎంచుకున్న రంగాల్లో రాణిస్తామని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటుచేస్తున్న శ్రీ వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నైపుణ్యంగల విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్, స్కూల్ ఛైర్మన్ సుశీల్‌వర్మ, జంగారెడ్డి, ఉమేష్‌కుమార్, బిజెపి డివిజన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రవిశంకర్, వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుజన తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్ అందజేస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** పదవ తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు పన్యాల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష పాడ్, జామెట్రి బాక్సును పంపిణీ చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పది వేల రూపాయలు బహుమతి ప్రధానం చేస్తామని టీం యంఆర్ఆర్ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సాయిరాం, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, మైపల్‌రెడ్డి, యుగేందర్, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నాసిరకం మందుల విక్రయాన్ని అరికట్టాలని ఎఐవైఎఫ్ నేతల వినతి

**హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకం మందులు విక్రయి స్తున్న మెడికల్ షాపులు, క్లినిక్‌లపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నేతల బృందం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వి.బి.కమలహాసన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, కె.ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులు, క్లినిక్‌లో యాంటి బయోటిక్స్ ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని, అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపించారు. అర్హత లేని వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం అడుతున్నారని విమర్శించారు. పార్మసీ చేసి ఉన్నత చదువులు చదివే వారి సర్టిఫికేట్లు ఉపయోగించి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అర్హతలేని వారితో వ్యాపారం చేయిస్తున్న దుకాణదారులపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. షెడ్యూల్ హెచ్ హెచ్చరికలతో మందులు సరఫరా అవుతున్నాయని, వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని, నకిలీ మందులు విక్రయించే వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి : చెకోలేకార్ శ్రీనివాస్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న చెకోలేకార్ శ్రీనివాస్

**మలక్‌పేట, మార్చి 6 ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి చెకోలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.మలక్‌పేటనుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లి సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ది చెందుతుందన్నారు. ఎన్నికలముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసు_ందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తామన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైనేజీలో షిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలి : కార్పొరేటర్ సుజాతానాయక్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

**వనస్థలిపురం, మార్చి 6 ప్రభాతవార్త:** డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తే, డ్రైనేజీ సమస్య ఉత్పన్నం కాదని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలాలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్న పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ డ్రైనేజీల్లో పేరుకుపోయిన షిల్టును తొలగించడంవల్ల మురుగునీరు సాఫీగా ప్రవహించి కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా ఉంటుందన్నారు. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. డివిజన్‌లోని కాలనీలలో సమస్యలు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, భీమ్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి వేడుకలకు సిద్దమైన శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం



**సైదాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం మహ శివరాత్రి పర్వదిన వేడుకలకు ముస్తాబయింది. దేవాలయ ఆవరణలో ఉన్న శ్రీ నాగేశ్వర, శ్రీ స్పటిక లింగేశ్వర, శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయాలలో మహ శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9గంటలవరకు ప్రత్యేక రుద్రాభిషేకములు, ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రుద్ర హోమము, రాత్రి 10.30కు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, రాత్రి 1.30కు శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహ శివరాత్రి సందర్భంగా దేవాలయంలో నిర్వహించబడుతున్న పూజా కార్యక్రమాలలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కార్యనిర్వాహణాధికారి యం.శ్రీనివాసశర్మలు కోరారు.

## ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజిరెడ్డి తదితరులు

**సైదాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న సైదిరెడ్డిని బుధవారం చంపాపేట డివిజన్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదుపు రాజిరెడ్డి, చేగోని మల్లేష్‌గౌడ్, ఉమా మహేశ్వర్, బొంబాయి యాదయ్య, పనుగుల జగదీష్‌గౌడ్, గుండెబోయిన చందు యాదవ్, జగదీష్‌నతదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఎల్ఆర్ఎస్‌పై మాటమార్చిన కాంగ్రెస్

## ప్రజలపై వేల కోట్ల భారాన్ని మోపాలని చూస్తున్న ప్రభుత్వం : సబితా ఇంద్రారెడ్డి



ధర్నాలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి ప్రజలపై వేల కోట్ల భారాన్ని మోపాలని చూస్తున్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాక ముందు ప్రజల మధ్యకు వచ్చి వాగ్దానాలు చేసిన నాటి ప్రతిపక్ష నేతలు నేడు మంత్రులైన తర్వాత మాట తప్పుతారా? అంటూ ఆమె నిలదీశారు. పేద,మధ్యతరగతి ప్రజల సంక్షేమంపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులందరికీ ఉచితంగా క్రమబద్ధీకరణ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కొత్త మున్సిపల్ కార్పొరేషన్ ముందు భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వందలాది మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, మహిళలతో కలిసి రోడ్డుపై బైఠాయించిన సబితారెడ్డి ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఈ మేరకు ఆమె అధికారంలోకి రాకముందు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ఎల్ఆర్ఎస్ విషయంలో మాట్లాడిన రికార్డింగ్ మాటలను సెల్‌ఫోన్ ద్వారా మైక్‌లో వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు సిఎం కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకోసం మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయబోతే నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ ఎవ్వరూ కట్టవద్దని నేటి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నాడు బహిరంగంగా ప్రజలకు చెప్పారని ఆమె వెల్లడించారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అయితే న ఓ ఎల్ఆర్ఎస్.. నో టిఆర్ఎస్ అని నినదించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ నేడు మాట మార్చి ఈ నెల 31లోపు చెల్లించాలని చెప్పడం ప్రజలను పీల్చి పిప్పిచేయడమేనని ఆమె దుయ్యబట్టారు. ఎల్ఆర్ఎస్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ధనాన్ని ప్రజల నుండి దోచుకోవడానికి రెడీ అయ్యిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్‌పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వేసిన కోర్టులో వేసిన పిల్ ఏమైందని సబితారెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ వసూలు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఈ నెలాఖరు వరకు టార్గెట్ పెట్టారనీ ఈ మేరకు వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన బిఆర్ఎస్ నిలిచి ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేసే వరకు బిఆర్ఎస్ పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ ధర్నాలో మీర్‌పేట్ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ ఫ్లోర్ లీడర్లు సూర్ణగంటి అర్జున్, అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, సంరెడ్డి స్వప్న జంగారెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, నియోజకవర్గ బిఆర్ఎస్ నేతలు మురుకుంట్ల అరవింద్‌శర్మ, నిమ్మల నరేందర్‌గౌడ్, లిక్కి మమత కృష్ణారెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, పాలమూరి విజయలక్ష్మి రాజు, నాయకులు దిండు భూపేష్‌గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, దేవ్లా నాయక్, పంతంగి మాధవి వెంకటేశ్వర్‌రావు, శ్యామల, కీసర సుధాకర్‌రెడ్డి బలరామకృష్ణ, సిద్దాల అంజయ్య, రామిడి తూఫాన్‌రెడ్డిలతో పాటు వందలాది మంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా నేరెడ్‌మెట్ శ్రీ కాశీ విశ్వనాధ దేవాలయంలో పూజలు



మహాశివరాత్రి సందర్భంగా ముస్తాబైన శ్రీ కాశీవిశ్వనాథ దేవాలయం..

**నేరెడ్‌మెట్, మార్చి 6 ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా నేరెడ్‌మెట్ మూదుగుళ్ళ వద్ద ఉన్న శ్రీ కాశీవిశ్వనాథ దేవాలయంలో నేటి నుండి 9వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున సుమారు 1లక్ష మంది భక్తులు దేవాలయానికి వచ్చి దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. నేడు ఉదయం గణపతి పూజ, నవగ్రహ హోమం, రుద్ర హోమం, సహస్ర పట్టాభిషేకం, శివరాత్రి రోజు ఉదయం 4గంటలకు సుప్రభాతసేవ, 11రకాల పండ్లతో అభిషేకం నిర్వహించబడుతుందన్నారు. మహాశివరాత్రి పండుగను ఆలయంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ లేని వారిపై చర్యలు తప్పవు : కమిషనర్ సత్యనారాయణరెడ్డి



వ్యాపార లైసెన్సును అందజేస్తున్న కమిషనర్ సత్యనారాయణరెడ్డి

**తుర్కయంజాల్, మార్చి 6 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులంతా, వ్యాపార లైసెన్స్ తీసుకొని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వ్యాపార లైసెన్స్ తీసుకోని షాపులపై జరిమానాలు విధిస్తామన్నారు. 2023-2024 సంవత్సరంలో లైసెన్స్ లు తీసుకున్నవారు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా మార్చ్ 31 లోపు తీసుకోవాలన్నారు. లేనియెడల 25% అపరాధ రుసుము విధించడం జరుగుతుందని తెలిపారు. పురాభివృద్ధికి ప్రతి ఒక్కరు కలిసి రావాలని సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్స్ ఫీజులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇఇ హరీష్, భానుమతి, రోజా పాల్గొన్నారు.

## మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతను సాధించాలి : వక్కలంక




కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు

**ఎల్.బి.నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** మహిళలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాధికారికను సాధించాలని డాక్టర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మమత అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మగవాళ్ళకి దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మానవ జాతికి మహిళ ఒక వరం అని, మహిళా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ లింగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్ రెడ్డి, మహిళా మండలి అసోసియేషన్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల మమత, ఉపాధ్యక్షురాళ్లు వక్కలంక అన్నపూర్ణ, కామినేని రామలక్ష్మి, వీరవల్లి జ్యోతి, తోడేటి సరిత, అడ్డు నిత్య, సుగురు సంధ్య, దండెం పద్మ, కైరం కొండ శిరీష, అన్నభత్తుల రమాదేవి, అంతోజు సూర్యకళ, రజని, సుష్మ, శ్రీ లక్ష్మి, కే. వనితారెడ్డి, రచన రేణుక, ప్రశాంతి, స్వప్న, శిరీష, నిర్మల, హారిక, గీత పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



జోనల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా

**ఎల్.బి.నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ గతంలో ఉచితంగా ఎల్ఆర్ఎస్ ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా డిమాండ్ చేశారు. గత ఎన్నికల హామీలలో భాగంగా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడు ఎల్.ఆర్.ఎస్.ని పూర్తిగా నయా పైసా ఖర్చు లేకుండా చేస్తామని బూటకపు వాగ్దానంతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రాగానే సామాన్య ప్రజలను నడ్డి విరిచే విధంగా ఎల్ఆర్ఎస్ పైన సుమారు రూ.20వేల కోట్లు వసూలు చేయడానికి నిరసిస్తూ బుధవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం ముందు టిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ ఇవ్వటానికి వ్యతిరేకం కాదు కేవలం ఎలక్షన్ రాగానే బూటకపు హామీలు ఇచ్చి అమలు చేయలేని స్థితికి దిగజారి నందుకు ప్రజల తరపున పోరాటానికి సిద్ధమైందని అన్నారు. ఎల్.ఆర్.ఎస్. పైన నయా పైసా తీసుకోకుండా చేసేంతవరకు టిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి 14 ఎంపి స్థానాలు వస్తాయి: కొలన్ శంకర్‌రెడ్డి



ఎంపి రాములును సన్మానిస్తున్న శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 6 ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి 14 ఎంపి స్థానాల్లో విజయం సాధించబోతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బిజెపిలో చేరిన నాగర్‌కర్నూల్ ఎంపి పి.రాములను కలిసిన శంకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎంపి ఎన్నికల్లో నరేంద్ర మోడి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి బిజెపితోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మంగియా నాయక్, ధర్నా నాయక్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భవన్స్ కళాశాలలో ఘనంగా నివృత్తి ఫేర్‌వెల్

### విద్యార్థులు నృత్యాలతో హోరెత్తిన కళాశాల..




నివృతి ఫేర్వెల్ కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు..

**నేరెడ్‌మెట్, మార్చి 6 ప్రభాతవార్త :** భారతీయ విద్యాభవన్ భవన్స్ వివేకానంద కళాశాల సైన్స్ హ్యుమానిటీస్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో నివృతి ఫేర్వెల్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.ఎస్.కె. ఆర్. చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో నేర్చుకున్న క్రమశిక్షణను అమలు పర్చుకుంటూ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి. పలు రంగాల్లో తమ ప్రతిభను చూపించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్రెషన్ కో ఆర్డినేటర్ దివ్యరేఖ, కళాశాల సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.